క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

కాచిగూడ: యశోధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద యువతీ యువకులు, అనాథ బాల బాలికలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి అరుణ జ్యోతి తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, జీవన నైపుణ్యం, బ్యూటీషియన్, టైలరింగ్, మెహిందీలపై 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులకు వసతి, భోజనం, రవాణా ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8790361631 లో సంప్రదించాలని కోరారు.

స్వామి రామానందతీర్థ సేవలు ఎనలేనివి



సమావేశంలో పాల్గొన్న దామోదర్‌గుప్తా, జనార్ధనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ విముక్తి పోరాట యోధులు స్వామి రామానందతీర్థ సేవలు ఎనలేనివని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన పోరాట యోధులు స్వామి రామానంద తీర్థ సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ మాట్లాడుతూ నైజాం పాలనలో తెలుగు భాష సంస్కృతి పరిరక్షణ కోసం ఉద్యమించిన రామానంద తీర్థ చివరివరకూ తెలంగాణ విముక్తి కోసం పోరాడారన్నారు. ఆంధ్ర మహాసభ స్థాపనలో కీలక పాత్ర పోషించిన రామానంద తీర్థ, పూర్వ ప్రధాని పీవీ నర్సింహారావుకు మార్గదర్శి అన్నారు. జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడుతూ తెలంగాణ భారత ప్రభుత్వంలో విలీనం కావడంలో రామానంద తీర్థ కీలకంగా వ్యవహరించారన్నారు. సామాజిక కార్యకర్త, వైఎస్ఆర్ మూర్తి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారావు మృతి తీరని లోటు

కాచిగూడ: సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు సిహెచ్‌వీఎం కృష్ణారావు మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటని పలు జర్నలిస్టు సంఘాల నేతలు అన్నారు. కృష్ణారావు మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ కార్యదర్శి పులి పలుపుల ఆనందం, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి జగదీష్ తదితరులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తోటి జర్నలిస్టు మిత్రులందరిచే బాబాయిగా పిలిపించుకున్న కృష్ణారావు సుదీర్ఘకాలం మీడియాలో వివిధ సంస్థల్లో పనిచేశారన్నారు. ఏలూరులో జర్నలిస్టుగా జీవితం ప్రారంభించిన కృష్ణారావు, ఆంధ్రప్రభ, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రభూమి, దక్కన్ క్రానికల్ దినపత్రికల్లో పనిచేశారని తెలిపారు. బ్యూరో ఇన్‌చార్జీగా పనిచేసినప్పటికీ మిగిలిన జర్నలిస్టు మిత్రులతో కలిసిమెలిసి ఉండే వారని, ఉమ్మడి రాష్ట్రంలో పనిచేసిన అనేకమంది ముఖ్యమంత్రులు, ఐఏఎస్ అధికారులతో ఆయనకు ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న బీఎస్పీ నేతలు, కార్యకర్తలు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన దళితులు, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పోచగారి నరేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన దళితులందరికి దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అర్హులైన బీసీలు, మైనార్టీలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాలను కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాత్రమే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో అబ్రహార్ ఆజాద్, రుద్రవరం సునీల్, సనందకుమార్, పల్లెర్ల పరమేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



చెప్పల్‌బజార్‌లో వినాయక విగ్రహం పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాచిగూడ చెప్పల్‌బజార్‌లో యంగ్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గణపతి విగ్రహం పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక విగ్రహ ఏర్పాటు పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 45 ఏళ్లుగా ఈ శుభకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న సాయిబాబా, వారి బృంద సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో దిడ్డి రాంబాబు,డాక్టర్ బద్దుల ఓంప్రకాష్, ఎర్ర భీష్మదేవ్, కె.సదానంద్, బాబ్జీ, రాజేష్, మహేష్, బి.కృష్ణాగౌడ్, బీజేపీ నేతలు బి.బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, ప్రతిభ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

అంబర్‌పేట: నియోజకవర్గంలో రహదారుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం ఆయన గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో రూ.44 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. చిన్న చిన్న గల్లీల్లో సైతం సీసీ రోడ్లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామన్నారు. పైప్‌లైన్ వ్యవస్థ, పార్కులు, నాలాల అభివృద్ధిని చేసి ప్రజల ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, జైస్వాల్ గార్డెన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగుదాం





సర్దార్ సర్వాయి పాపన్న చిత్రాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్వాయి పాపన్న స్ఫూర్తితో ప్రజాహితం కోసం ముందుకు సాగాలని తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న జీవన పోరాటాల చిత్రాల ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తాటికల్లు కిక్కు ఫుల్ ఆడియో సాంగ్‌ను ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె రవికుమార్‌గౌడ్ మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యేలా పాపన్న జీవిత పోరాట గాథలను చిత్రీకరించారన్నారు. 350 ఏళ్ల క్రితమే సామాన్య కల్లుగీత కుటుంబంలో పుట్టిన పాపన్నగౌడ్ భూస్వాములు, మొగల్ రాజులకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటను జయించిన వీరుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలన్నారు. జయరాజు మాట్లాడుతూ ప్రకృతి ఇచ్చిన తాటి, ఈత చెట్ల ద్వారా వచ్చిన కల్లు ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ సభ్యులు కిషోర్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, భూపతి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, డాక్టర్ విజయ్‌కుమార్‌గౌడ్, చంద్రయ్య, కుర్ర అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాల, మాదిగల మధ్య చిచ్చుపెడితే సహించం



మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ముషీరాబాద్: మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలు చేయాలనుకుంటే తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని తెలంగాణ రాష్ట్ర మాలల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్, గుడిమల్లె వినోద్‌కుమార్ అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిలకు మాల, మాదిగలపై ఏ మాత్రం ప్రేమ ఉన్న వారికి రాజ్యాధికారంలో అవకాశం కల్పించాలన్నారు. జనరల్ అసెంబ్లీ స్థానాల్లో మాల, మాదిగలకు సీట్లు కేటాయించి నిజాయితీని చాటుకోవాలని కోరారు. మాల, మాదిగల మధ్య విభేదాలు సృష్టించడం ద్వారా రాష్ట్రంలో అశాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల రాంప్రసాద్, విజయ్‌కుమార్, దండు మల్లేష్, లక్ష్మణ్, సుమన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య అరెస్టు అనైతికం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీసీ నేతలు

ముషీరాబాద్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పలు బీసీ సంఘాల నేతలు అన్నారు. ఉపాధ్యాయులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా, పార్లమెంటరీ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఆర్.కృష్ణయ్యను అరెస్టు చేశారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. సహేతమైన కారణాలు లేకుండా పార్లమెంట్ సభ్యుడిని అరెస్టు చేయడం చట్ట విరుద్ధమన్నారు. గత 50 ఏళ్లుగా ఆర్.కృష్ణయ్య ఎన్నో ఉద్యమాలు చేపట్టారని 13 మంది ముఖ్యమంత్రుల హయాంలలో ఎనాడు ఇలాంటి దమనకాండ, నిర్బంధం, అరెస్టులు జరగలేదని వారు తెలిపారు. దీనిపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, సుధాకర్‌ముదిరాజ్,రాజ్‌కుమార్, రాములు, కృష్ణయాదవ్, వెంకట్, దీపిక పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వినయ్ కుమార్, రత్నసాయిచంద్

చిక్కడపల్లి: సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరుతూ గురువారం గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ చందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ గాంధీనగర్ డివిజన్‌లోని పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందకుండా పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కార్యకర్తలకే పథకాలు కేటాయిస్తూ ఎన్నికల లబ్ధికోసం ఉపయోగించుకుంటున్నారన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు అర్హులకు అందజేయాలని గృహలక్ష్మి పథకం సొంత ఇంటి పట్టాలు ఉన్న లబ్ధిదారులకు అందజేయాలని కొత్త రేషన్ కార్డులు అందజేయడంలో అవకతవకలు లేకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ చందనను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్, శ్రీకాంత్, ఉమేష్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, ప్రకాష్‌యాదవ్, ఎండి మహమూద్, సాయికుమార్, దేనేటి సత్యం, ముత్యంరెడ్డి, ఆనంద్‌రావు, రవీందర్‌గౌడ్, ప్రశాంత్, వేణు, తేజ పాల్గొన్నారు.

బీసీ, ఓబీసీలను ఆదుకోవాలి

తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు కేపీ మురళీ కృష్ణ



నల్లకుంట: బీసీల్లోని 18 కులాలతో పాటు విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తుల వారికి రూ. లక్ష ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ.మురళీ కృష్ణ అన్నారు. గురువారం నల్లకుంట రత్నానగర్‌లోని బీసీ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నారన్నారు. వారిలో చాలా మంది పేదరికంలో బతుకుతున్నారని, బీసీలతో పాటు ఓబీసీలను ఆర్థికంగా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ జాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం సీట్లు కేటాయించాలి

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు 50శాతం సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. గురువారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో సముచిత ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలు బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. జనాభా ప్రకారం బీసీలకు రాజ్యాధికారంలో వాటా దక్కడం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, సిహెచ్ ప్రదీప్ గౌడ్, నల్లెల కిషోర్, భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

19న ధర్నాలో పాల్గొనడం లేదు



మాట్లాడుతున్న గాలిపెల్లి కృష్ణ, బి.ఇందిర తదితరులు

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం పెంచాలని కోరుతూ కొన్ని యూనియన్లు, కొందరు నేతలు కార్మికులను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేస్తూ ఈ నెల 19న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో పాల్గొనాలని పిలుపునివ్వడాన్ని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ యూనియన్ అధ్యక్షుడు గాలిపెల్లి కృష్ణ, బి.ఇందిర తప్పుబట్టారు. తమ యూనియన్ సభ్యులెవరూ ధర్నాలో పాల్గొనవద్దని వారు సూచించారు. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు కార్మికులకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అండగా ఉన్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొందరు నేతలు తమ స్వలాభం కోసం కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే స్వీపర్స్, కామాటీల డిమాండ్లతో కూడిన వినతి పత్రం ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు అందజేశామని, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున కార్మికులు ధర్నాలో పాల్గొని అనవసరమైన కేసుల్లో ఇరుక్కోవద్దని వారు సూచించారు. ఏవైన సమస్య లుంటే ప్రభుత్వం, ఉన్నతాధికారులతో చర్చల ద్వారా పరిష్కరించుకుందామని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జి.మల్లేష్, ఐ.లలిత, కె.లక్ష్మీ, ఎం.శాలిని, సోమయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే... మాధవ సేవ



అజయ్ కుమార్, వంశి ముదిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు

కాచిగూడ: 'మానవ సేవే.. మాధవ సేవ'గా భావించి యువత సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు అన్నారు. జన్మదిన వేడుకల పేరుతో డబ్బును వృథాగా ఖర్చు చేయకుండా పదిమంది అవసరాలు, ఆకలిని తీర్చుతూ యువత ముందుకు సాగాలని సూచించారు. గురువారం కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయం వద్ద జె.అజయ్ కుమార్, వంశి ముదిరాజ్ జన్మదిన వేడుకల సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద, ఫుట్‌పాత్‌లపై ఉండే వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు బ్రెడ్, పండ్లు అందజేశారు. సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. ఎంత సంపాదించినా రాని ఆనందం పేదలకు చేయూత అందించడంలో ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న యువత భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హిందూ ధర్మ రక్షణ కోసం యువత ఉద్యమించాలని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సూర్య, శుక్లా, నందకిషోర్, వెంకట్, వినీత్ యాదవ్, ప్రవీణ్ కుమార్, నరేష్, మల్లికార్జున్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి

అంబర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చేయూతనిస్తే వారు ఉన్నత లక్ష్యాలు సాధిస్తారని బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పాలిటెక్నిక్ కాలేజీ బస్టాప్ వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరికీ ఆయన ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. 150 మంది విద్యార్థినిలు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాధించేందుకు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి సొంత ఖర్చులతో అందరికీ బస్‌పాస్‌లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, నాయకులు నాగేష్ గౌడ్, దేవిరెడ్డి విజితారెడ్డి, మురళీకృష్ణ, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



అడిక్‌మెట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు బస్తీల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ఆయన అడిక్‌మెట్ డివిజన్ భారత్ సేవా సమాజ్ ప్రాంతంలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిక్‌మెట్ అనురాధా సదన్ అపార్ట్‌మెంట్ వద్ద డ్రైనేజీ లీకేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, స్థానిక బ్రిడ్జీ వద్ద అక్రమ పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జలమండలి అధికారులతో మాట్లాడి అవసరమైతే కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీల్లో మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడంతో పాటు రోడ్లు, విద్యుత్, కమ్యూనిటీహాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు శరవేగంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం వల్లనే అదే స్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిచడమే లక్ష్యంగా పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగడం నేత ముఠా జైసింహ, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, మాధవ్, శ్యామ్‌సుందర్, నేత శ్రీనివాస్, ముచ్చుకుర్తి ప్రభాకర్, ఖలీల్, అబ్బు, శ్రీధర్‌రెడ్డి, నాగులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



సమావేశంలో పాల్గొన్న పాక జ్ఞానేశ్వరిప్రసాద్

చిక్కడపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఖాయమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరిప్రసాద్ అన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి నాయకత్వంలో పలువురు సభ్యులు ఢిల్లీ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీలోని స్టేడియంలో జరిగిన సమావేశంలో మహిళల ఉత్సాహాన్ని చూస్తే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే ధీమా ఏర్పడుతోందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని మహిళా కాంగ్రెస్ కార్యవర్గసభ్యులు , కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో పని చేసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవాలన్నారు.

అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలి

నల్లకుంట: అర్హులైన ప్రతి ఒక్కరికీ దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లకుంట డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లో ఇంటింటికీ తిరిగి నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్, దళిత బంధు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా నాయకులు విశ మంగి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను అందజేస్తున్న వనం రమేష్

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి



నియామక పత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, ఐక్యతకు పాటు పడాలని నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల ఆనంద్ గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేటలోని తన కార్యాలయంలో అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా దాసోజు భిక్షమాచారిని నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... అసోసియేషన్ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్‌నేత, ఈశ్వర్, పరుశురామ్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో కేన్సర్ నివారణ



దంత పరీక్షలు చేస్తున్న దృశ్యం

నల్లకుంట: దంత సంరక్షణ కోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం భోజనానంతరం దంతాలు, నోటిని శుభ్రం చేసుకోవడం ఎంతో అవసరమని దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగా రెడ్డి అన్నారు. నోటి ఆరోగ్యం క్షీణించడం కేన్సర్‌కు దారితీస్తుందన్నారు. గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద గల దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రిలో రెండో రోజు ఉచిత దంత వైద్య శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ రంగారెడ్డి మాట్లాడుతూ నల్లకుంట, రామంతాపూర్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్ వనస్థలిపురం ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమయాభావం కారణంగా స్థానికుల విజ్ఞప్తి మేరకు పేర్లు నమోదు చేసుకున్న వారికి రెండో రోజు కూడా దంత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దంత సమస్యలు సాధారణమని, దంత, చిగుళ్ల వాపు సమస్యలు తలెత్తితే వెంటనే దంత వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈ సందర్భంగా అందరికీ టూత్ బ్రష్‌లు, పేస్టులను పంపిణీ చేశారు.